క్లుప్తంగా

పంటల వివరాల నమోదు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య అన్నారు. మండల పరిధిలోని హుస్సెళ్లి, న్యాల్‌కల్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఏఈఓలు మాధవి, ఈనాబాయి క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు.

బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని పోతన్‌పల్లి(ఆర్) గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నీరుడి సాయిలు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో బీమా కింద నామినీగా ఉన్న మృతుడి భార్య నాగమణికి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్, గ్రామ అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచి అంజయ్య, గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పండరి, శంకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీకి రాజీనామా

సదాశివపేట(సంగారెడ్డి): బహుజన సమాజ్‌వాది పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కురుమ ప్రవీణ్‌కుమార్ బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేశానని తెలిపారు. అయితే పార్టీ విధి విధానాలు నచ్చకపోవడంతో పార్టీకి తన అనుచరులతో రాజీనామా చేసినట్లు చెప్పారు.

కార్మిక హక్కులపై అవగాహన తప్పనిసరి

సంగారెడ్డి: కార్మిక చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మెద్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మేద్వాన్ కార్యాలయంలో కార్మికులకు కార్మిక చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200 మందిని గృహ కార్మికులుగా గుర్తించి ఐడీ కార్డులు అందజేశామన్నారు. కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత పరిశ్రమల యాజమాన్యాలపై ఉందన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వీరేశం మెద్వాన్ కోఆర్డినేటర్లు స్వప్న, ముహజీబ్, సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జాలను అరికట్టాలి

సంగారెడ్డి టౌన్: భూకబ్జాలకు పాల్పడుతున్న నిమ్స్ బరో ల్యాండ్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏఓ పరమేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగలగిద్ద, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లోని ఆయా గ్రామాల్లో భూములను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి భూకబ్జాలను అరికట్టి నిమ్స్ బరో ల్యాండ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాగులపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కోనాపూర్ మీదుగా నాగులపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. గుంతలమయంగా మారిన నాగులపల్లి రోడ్డును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో అధికారులు వెంటనే స్పందించి నాగులపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామ యువకులు వినోద్‌కుమార్, రాజేష్, వీరన్న, సురేష్, రత్నం, నాగరాజు, నవీన్, అంజయ్య, నరేష్, బాలరాజ్, శేఖర్, ప్రసన్నకుమార్, మహేష్ పాల్గొన్నారు.

తల్లీకొడుకును కలిపిన పోలీసులు

కంది(సంగారెడ్డి): కనిపించకుండా పోయిన కుమారుడి ఆచూకీ కోసం దిగులు పడుతున్న ఆ తల్లి బాధ పోలీసుల కృషితో తీరింది. వివరాల్లోకి వెళ్తే.. కందికి చెందిన సత్యాగామ మానెమ్మ కుమారుడు అరుణ్‌రెడ్డి ఆరేళ్ల క్రితం ఎంబీబీఎస్ చదువుకునేందుకు ఫిలిపిన్స్‌కు వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో దిగులు చెందిన మానెమ్మ కుమారుడి ఆచూకీ తెలపాలని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఫిలిపిన్స్ ఎంబసీతో సంప్రదించి అరుణ్‌రెడ్డి ఆచూకీ కనుగొని మానెమ్మతో ఫోన్ ద్వారా మాట్లాడించారు. కుమారుడి ఆచూకీ లభ్యం కావడంతో మానెమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేసింది.

విద్యుత్ కోతలు విధించొద్దు

- అధికారులకు ఎంపీ షెట్కార్ ఆదేశం
- ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్: విద్యుత్ కోతలు విధించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. నాగల్‌గిద్ద మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లక్ష్మిబాయి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఎంపీటీసీ పండరినాథ్‌రావు మాట్లాడుతూ అధికారులు అనవసరంగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ విద్యుత్ కోతలపై ప్రజలకు తనకూ ఫోన్ చేస్తున్నారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు అనవసరంగా విద్యుత్ కోతలు విధించకూడదని ఆదేశించారు. ప్రజల అవసరాలు తీర్చే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వానాకాలం సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులకు విత్తనాల సమస్యలు లేకుండా వ్యవసాయ అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్టికల్చర్, మిషన్ భగీరథ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులను సభ్యులు ప్రశ్నించారు. జెడ్పీటీసీ రాజు రాథోడ్, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్వహణపై ఆగ్రహం

- వైద్యుల పనితీరుపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి అసంతృప్తి
- సిర్గాపూర్ ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా మారిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వైద్యాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సిర్గాపూర్ పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. యూడీసీ అంజనేయులు నెలల తరబడిగా విధులకు హాజరుకాకపోవడంతో పాటు రిజిస్టార్‌లో హాజరు వివరాలు లేకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే డాక్టర్ ప్రతిభ చేత రిజిస్టార్‌లో గైర్హాజరు వేయించారు. పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని మాజీ సర్పంచ్ జంగం స్వప్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి హెచ్చరించారు.

విద్యుత్ అధికారులపై మండిపాటు

విద్యుత్ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించడంలేదని ఎమ్మెల్యే సంజీవరెడ్డి మండిపడ్డారు. సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించని లైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సుప్రజను ఆదేశించారు. విద్యుత్ కొరతలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రయగబాయి, ఎంపీడీఓ మల్సూర్, తహసీల్దార్ ఉమశంకర్, ఏఓ శశాంక్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్ కాలనీలోని బస్సు డిపో ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పేకాట ఆడుతున్నవారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.20,720 నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఏడుగురు రామచంద్రాపురానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్ 11 వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ శాంతినగర్‌లోని 11 వార్డులో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికి రావడంలేదని వాపోయారు. కాలనీలో ఉన్న బోరు చెడిపోవడంతో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. బిందెడు నీళ్ల కోసం నానా అవస్థలు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎంపీ రఘునందన్‌రావుకు సన్మానం



ఎంపీ రఘునందన్‌రావుకు మొక్కను బహూకరిస్తున్న బలరాం తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావును స్థానిక బీజేపీ నాయకుడు బలరాం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందని ఆకాంక్షించారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



కాశీంపూర్‌లో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బస్వరాజ్ అన్నారు. మండల పరిధిలోని కాశీపూరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన తదితర సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లి మండలంలో..

మునిపల్లి(అందోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ దశరథ్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సమైఖ్య, డ్వాక్రా గ్రూపు సభ్యులతో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ వెంకటేశం, ప్రధానోపాధ్యాయురాలు శరణమ్మ, ఉపాధ్యాయురాలు పూర్ణిమ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కంది(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కంది రూరల్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కందిలోని కిసాన్‌సాగర్ చెరువులో బుధవారం సాయంత్రం వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి 25 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఒంటిపై నల్లని టీషర్ట్, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712656746 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



నారాయణఖేడ్: కేక్ కట్ చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్



కల్హేర్: సిర్గాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినాన్ని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ నారాయణఖేడ్‌లోని తన నివాసంలో కేక్ కట్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

మునిపల్లి(అందోల్: మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామంలోని హజ్రత్ సయ్యద్ షా ఫక్రుద్దీన్ ఖాద్రి అల్లా హెస్సేని కిట్ల ఆరోహెచ్ ఉర్సు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్సు నిర్వాహకులు సజ్జద్ నసీన్, సయ్యద్ లతిఫ్ ఉద్దీన్ ఖాద్రి, ఆల్ హెస్సేని, బంధ నవాజీ తదితరులు పాల్గొన్నారు.

◆ అదనపు నీటి మోటారు ఏర్పాటు

నారాయణఖేడ్: పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నీటి సంపు వద్ద 15 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటారును ఏర్పాటు చేశారు. తక్కువ సామర్థ్యం ఉన్న మోటారు ఉండటంతో నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ బాబు జగ్జీవన్, కౌన్సిలర్లు రామకృష్ణ, సద్దాం కలిసి నీటి మోటారును ప్రారంభించారు.

◆ నేడు ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను బుధవారం ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

◆ జేఎన్టీయూ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్

సంగారెడ్డి: జేఎన్టీయూ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న పడకంటి పవిత్రాచారి బెంగళూరులో నిర్వహించిన ఖేలో ఇండియా క్రీడల్లో ఉషా ఉమెన్స్ లీగ్‌లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యజీ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య రాఘవేంద్రరావు, మెకానికల్ విభాగాధిపతి ప్రసన్నలక్ష్మీ అభినందించారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీలలో అంతర్గత మురుగునీటి కాలువల సమస్య ఉందని, త్వరలో కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. మార్కెట్ రోడ్డులో నిర్మిస్తున్న మీట్ మార్కెట్ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. డివిజన్ పరిధిలోని శ్మశాన వాటికలను పరిశీలించి, వాటి అభివృద్ధికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన డివిజన్ కార్యాలయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛ పటాన్‌చెరు కోసం ప్రతిఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పోచమ్మతల్లి అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఎస్సీ కాలనీలో ఉన్న పోచమ్మ దేవాలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



సదాశివపేట: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



హత్నూరలో...

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఊబచెరువు కట్టను తవ్వి రోడ్డు వేయడమే కాకుండా ప్రభుత్వ శిఖం భూమిని కబ్జా చేసి ప్లాట్లు చేసిన రియల్ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలన్నారు. నందికంది, పిన్నచెరువు, రెడ్లపల్లి కుంట, ఎన్కెపల్లి చెరువు, కుక్కలబావి చెరువుల శిఖం భూములు కబ్జాకు గురవుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, అనంద్, అనిల్, ప్రదీప్, సందీప్, రాజు, నర్సింలు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు,

హత్నూర మండలంలో...

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని చెరువు కుంటల శిఖం భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు బుధవారం తహసీల్దార్ పర్వీన్ షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులోని అలవాయి చెరువు, తలీమ్ చెరువు, పెద్ద చెరువు, శిఖం భూములను కొందరు ఆక్రమించి పంట సాగు చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి శిఖం భూమి ఎన్ని ఎకరాల్లో ఉందో తేల్చాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో హత్నూర గ్రామస్తులు దుర్గేశ్వర్‌రెడ్డి, నరేందర్, ఆంజనేయులు, గడ్డమీది కృష్ణ, వెంకటేశంగౌడ్, శేఖర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

నీరు నిలువకుండా చర్యలు తీసుకోండి



వర్షపు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్లపై నీళ్లు నిలువకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం పడితే ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, కాలనీవాసులు విఠల్‌రెడ్డి, సత్యానారాయణ, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, అరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి



కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తున్న రమాకాంత్

జిన్నారం(పటాన్‌చెరు): కాలుష్య సమస్యను పరిష్కరించేవిధంగా పోరాటం చేస్తామని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ అన్నారు. మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో బుధవారం కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య సమస్య పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయటంతో పాటు ఇంటింటికి వెళ్లి కాలుష్యం ద్వారా ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలను కూడా ప్రజలు తమదృష్టికి తీసుకువస్తున్నారన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పాటు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలకు అంగవైకల్యం అడ్డు కాదు



యూనిఫాం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టుదలకు అంగవైకల్యం అడ్డు కాదని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధురెడ్డి అన్నారు. బెల్ టౌన్‌షిప్‌లోని అభిలాష వోకేషనల్ సెంటర్‌లో మానసిక వికలాంగ విద్యార్థులకు బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక వికలాంగ విదార్థులు సైతం అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక సేవలో ఉండే ఆనందం మరెందులో ఉండదని తెలిపారు. కార్యక్రమంలో బెల్ లేడీస్ వెల్ఫేర్ సెంటర్ అధ్యక్షురాలు శాంతి, బీఆర్‌ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిషన్ భగీరథ సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మిషన్ భగీరథ సర్వే పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. కంది మండలంలో 14 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 22 వరకు సర్వే పూర్తి చేయడమలే లక్ష్యమని పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400